## క్లుప్తంగా

### ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ అక్రమం


ఉదయ్‌వంశీ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

**తిరుపతి మంగళం :** లిక్కర్ స్కామ్ పేరుతో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అక్రమమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులతోనే కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి వైఎస్సార్‌సీపీ నేతలను జైళ్లకు పంపుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందనేందుకు ఇదే నిదర్శనమని వెల్లడించారు. చంద్రబాబు, లోకేష్ ఒత్తిడి తట్టుకోలేక లిక్కర్ కుంభకోణంలో ఆధారాలు సృష్టించేందుకు సిట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారని విమర్శించారు. జగనన్నకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ ఆదరణ చూసి కూటమి నేతలు ఓర్వలేక పోతున్నారన్నారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలకు వైఎస్సార్‌సీపీ నేతలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### నేడు మండల మీట్

**పాకాల :** మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శశిరేఖ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరవుతున్నారని, అధికారులు ఆయా శాఖల నివేదికలతో రావాలని ఆదేశించారు.

### 1 నుంచి ఇంటింటి సర్వే


సురేష్‌బాబు, తహసీల్దార్

**తిరుపతి అర్బన్ :** నగరవాసులు తమ సమీపంలోని పోలింగ్ కేంద్రంలోకి ఓటు మార్చుకునే వెసులుబాటును కల్పిస్తున్నామని, ఈ మేరకు ఆగస్టు 1వ తేదీ నుంచి బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేకు రానున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబు వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి అసెంబ్లీ పరిధిలోని 109 ప్రాంతాల్లో 274 పోలింగ్ కేంద్రాలు ఉండేవన్నారు. తాజాగా 126 ప్రాంతాల్లో 358 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున విభజించనున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ బూత్‌లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. వివరించారు. ఈ క్రమంలో బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు.

### వేతనాల పెంపు జీఓ అమలుకు వినతి


కమిషనర్‌కు విన్నవిస్తున్న ఉద్యోగులు

**తిరుపతి తుడా :** కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ సెక్షన్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్124 వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. మంగళవారం ఈ మేరకు కమిషనర్ మౌర్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు విన్నవించారు. కౌన్సిల్ తీర్మానంలోఈ అంశం చేరుస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. సంఘం నేతలు షేక్ కరీముల్లా, దేవేంద్ర, రేవతి, శ్రీను, లక్ష్మి, అమరావతి, నీరజ, సరళ, కుప్పయ్య, శ్రీనివాసులు, నవీన్, ధనంజయలు పాల్గొన్నారు

### స్టడీ టూర్‌కు పారిశుద్ధ్య సిబ్బంది


నవీ ముంబయికి వెళుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

**తిరుపతి తుడా :** పారిశుద్ధ్య నిర్వహణపై స్టడీ టూర్‌కు తిరుపతి కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం నవీ ముంబయికి బయలుదేరి వెళ్లారు. మూడు రోజులు పాటు ముంబయిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తారని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు.

### 25 నుంచి స్పాట్ అడ్మిషన్లు

**తిరుపతి సిటీ :** నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలల్లో ఈ నెల 25వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పోను, మిగిలిన సీట్లను మెరిట్ ప్రాతిపదికన కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---

''చంద్రబాబు అధికారం కోసం ఎంతకైనా దిగజారుతారు. ఓట్ల కోసం నోటికొచ్చిన అబద్ధాలు చెప్పేస్తారు. అందరి కంటే ఎక్కువ పథకాలను అందిస్తామని మాయ మాటలు వల్లిస్తారు. మారిన మనిషిని అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతారు. పీఠం ఎక్కిన తర్వాత ప్రజలను నిలువునా వంచిస్తారు. పేదలనే కనికరం కూడా లేకుండా నోటికాడ కూడును లాగేస్తారు. ఆడపడుచుల ఆశలను అడియాసలు చేసేస్తారు.. అయితే జగనన్న జనం కోసమే ఆలోచిస్తారు. బడుగుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తారు. ఇచ్చిన హామీల కంటే అధికంగా అమలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తారు. ఓట్ల కోసం అబద్ధాలను ఎన్నటికీ చెప్పని ఆదర్శనీయుడు'' అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు.


31వ డివిజన్‌లో..

# అబద్ధాలతో అధికారం

- ఓట్ల కోసం ప్రజలను చంద్రబాబు వంచించారు
- ఏడాది గడిచినా ఒక్క పథకం అందించలేదు
- జనం కోసమే పరితపించే నేత జగనన్న
- చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను వివరించిన భూమన అభినయ్‌రెడ్డి


17వ డివిజన్‌లో చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

**తిరుపతి మంగళం :** రైతు రుణాలు మాఫీ చేస్తామని, తక్కువ ధరలకే మద్యం అందుబాటులోకి తెస్తామని ప్రజలకు హామీలు ఇద్దామని కొందరు చెప్పినప్పటికీ అధికారం కోసం అబద్ధాలు చెప్పి మోసం చేయలేనన్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి కొనియాడారు. అదే గత ఎన్నికల్లోనోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రజాద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. మంగళవారం నగరంలోని 17, 20, 31వ డివిజన్లలో ఆయన ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారా? అంటూ స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అందిస్తానంటూ నమ్మించి మోసం చేశాడని స్థానికులు మండిపడ్డారు. ఒక్క పథకం అంటే ఒక్క పథకం కూడా ఇంతవరకు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటి వరకు కూటమి నేతలు తమ ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలేమైనా ఉన్నాయా? ప్రభుత్వ పథకాలు వస్తున్నాయా? అని అడిగిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నల్లాని బాబు, హరి, మురళి, పడమటి కుమార్, ఉమాపతి, బ్రహ్మానందరెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



### కూటమిపై పోరుకు సన్నద్ధం


మాట్లాడుతున్న కత్తి రవి

**తిరుపతి కల్చరల్ :** నిరుద్యోగ యువతకు హామీలు గుప్పించి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై పోరుకు సన్నద్ధం కావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపు నిచ్చారు. మంగళవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలోసంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీటీడీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిని వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై యువత ఉద్యమించాలన్నారు. నేతలు కె.రామకృష్ణ, మల్లికార్జున్, మురళి, నాగరాజు, పూర్ణ, విక్రమ్, సాయి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

**తిరుపతి తుడా :** గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. ప్రజల నుంచి అందించిన ఫిర్యాదుల మేరకు మంగళవారం నగరంలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మధురానగర్‌లోని డ్రైనేజీ కాలువలు, రోడ్లను పరిశీలించిన తర్వాత ఆమె మాట్లాడారు. డ్రైనేజీ కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులను ప్లానింగ్ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

### గంజాయి స్వాధీనం..ఒకరి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

**తిరుపతి రూరల్:** మండలంలోని తనపల్లి ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో రహస్యంగా దాచి ఉంచిన 650 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి కథనం మేరకు.. తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు ఈస్ట్ ఎక్సైజ్ సీఐ శ్యాంప్రసాద్ సంయుక్తంగా మంగళవారం తనపల్లె ఇందిరమ్మ ఇండ్లలోని బ్లాక్ నంబర్ 68 వద్ద దాడులు జరిపి, 650 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే దానిని దాచిపెట్టిన కుట్టి సతీష్‌ను అరెస్ట్ చేశారు. ఈ నెల 1వ తేదీన కుట్టి సతీష్‌కు గంజాయిని సరఫరా చేసిన బాగ్యరాజ్‌తోపాటు సతీష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు స్వామినాథన్, కవిశ్వరనాయుడు, హెడ్ కానిస్టేబుళ్లు మంజునాథ నాయుడు, రమేష్, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, మునిరెడ్డి, డేవిడ్, రూప్ కుమార్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ కోర్సుల రద్దుకు డిమాండ్


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

**తిరుపతి సిటీ :** ఎస్వీయూలో ఆన్‌లైన్ కోర్సులను తక్షణమే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వందలాదిమంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి వర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడించారు. వీసీ చాంబర్లోకి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి మాట్లాడుతూ స్వయం కోర్సుల ముసుగులో విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. పీజీ పూర్తి కావాలంటే ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరని నిబంధన విధించడం దారుణమని వాపోయారు. అధికారుల మొండివైఖరి విరమించుకుని తక్షణం ఆ కోర్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం వీసీ అప్పారావు ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులతో చర్చించారు. నేతలు శివశంకర్ నాయక్, అశోక్, వినోద్, తేజ, నరసన్న, గీతాంజలి, తిరుమలేష్, భాను, చక్రి, పాల్గొన్నారు.




## ముగిసిన పవిత్రోత్సవాలు

**తిరుపతి కల్చరల్:** శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ సదర్భంగా ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొల్పి తోమాల సేవ. సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవమూర్తులకు వేడుకగా తిరుమంజనం జరిపించారు. బాష్యకారుల గుడి వద్ద శాత్తు మొర నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి సమర్పించారు.

### విద్యా సామగ్రి పంపిణీ

**చంద్రగిరి :** పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లె, పనపాకంపేట ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. షిరిడీ సాయిబాబా గుడి ధర్మకర్త జవ్వాజి సాంబశివయ్య, పనపాకం హైస్కూల్ మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ పానేటి చెంగల్రాయులు సహకారంతో అందజేశారు. వైస్ ఎంపీపీ బొజ్జ వెంకటరత్నం, ఎస్వీ జూపార్కు మాజీ డైరెక్టర్ మణియాదవ్, హెచ్‌ఎం మంజువాణి, రిటైర్డ్ హెచ్‌ఎం అరిగిల రామచంద్రయ్య, హెచ్‌ఎం సురేష్, అనసూయ, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి, గీత, ఉపాధ్యాయుడు బి.చిట్టిబాబు పాల్గొన్నారు.


## అలరించిన అభినయ నాటకోత్సవాలు


ఆదికవి నన్నయ బట్టు పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం


దేవరాగం సాంఘిక నాటిక లోని ఓ సన్నివేశం

**తిరుపతి కల్చరల్:** అభినయ్ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం మహతి ఆడిటోరియంలో ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు. పౌరాణిక, సాంఘిక నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన శాస్త్రీయ జానపద నృత్య పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాబృందాలు పాల్గొని అద్భుత నృత్యాభినయాలతో ఆకట్టుకున్నారు. సాయంత్రం విజయనగరం శ్రీ శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన ఆదికవి నన్నయ్య బట్టు పద్య నాటకం ఆకట్టుకుంది. అనంతరం ఉత్తరాంధ్రకు చెందిన సౌజన్య కళా స్రవంతి వారు ప్రదర్శించిన దేవరాగం సాంఘిక నాటిక సందేశాత్మకంగా సాగింది. ఈ సందర్భంగా ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్ రెడ్డి జ్ఞాపికలు ఇచ్చి, సత్కరించి అభినందించారు.

## 'రియల్' వేధింపులు!



మునెమ్మ పేరిట రికార్డుల్లో నమోదైన భూమి. కోర్టు ఆదేశాల కాపీని వీఆర్‌ఓకు అందిస్తున్న మున్నెమ్మ కుమారుడు

- కీలుబొమ్మలుగా రెవెన్యూ అధికారులు
- టీడీపీకి అనుకూల కుటుంబానికీ తప్పని అవస్థలు

**సాక్షి, టాస్క్‌ఫోర్స్ :** ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపునకు అహర్నిశలు శ్రమించిన కుటుంబానికి సైతం కూటమి ప్రభుత్వంలో వేధింపులు తప్పడం లేదు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వివరాలు.. చంద్రగిరి మండలం ఏ.రంగంపేటకు చెందిన పాదిరి మునెమ్మకు 1938లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం సర్వేనంబర్ 229/2ఏలో 90 సెంట్ల పట్టా మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ కుటుంబమే సదరు భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రైతులు ఆరు నెలల క్రితం తమకు కాలిబాటకు దారి ఇప్పించాలంటూ రెవెన్యూ అధికారులను కోరారు. స్పందించిన అధికారులు మున్నెమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారు కూడా సానుకూలంగా కాలిబాట కోసం కొంత భూమిని ఇచ్చారు. మళ్లీ కొద్దికాలం తర్వాత అదే రైతులు తమకు బండిబాట కోసం దారి కల్పించాలంటూ రెవెన్యూ అధికారులను మరోసారి కోరారు. ఈ క్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్యతో పాటు సిబ్బంది మున్నెమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీనికి ఒప్పుకోకపోవడంతో రెవెన్యూ అధికారులు కక్షగట్టి వేధింపులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పొలంలో దుక్కి దున్నుతున్న క్రమంలో వీఆర్‌ఓ పనులను అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండిబాటకు దారి కోరే రైతులకు సమీపంలోని దళిత వాడ నుంచి 12 అడుగుల సీసీ రోడ్డు ఉందని, దానిని వదిలేసి మా పొలంలో దారి అడగడం సమంజసం కాదని మండిపడుతున్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించినట్లు వివరిస్తున్నారు. ఈమేరకు కోర్టు ఆదేశాల కాపీని సైతం వీఆర్‌ఓకు అందించినట్లు వెల్లడిస్తున్నారు.

### లోగుట్టు ఇదేనా..?

మునెమ్మ భూమికి మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ఈ క్రమంలోనే ఆ భూమి వెనుక ఉన్న రైతుల పొలాలకు సైతం రేటు పెరగాలంటే ఇక్కడి నుంచి రోడ్డు వేసుకుంటే వస్తుంది. ఇదే అదునుగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగినట్టు తెలిసింది. రెవెన్యూ అధికారులను తాము మేనేజ్ చేసుకుంటామని, రైతులను ఒప్పించి ఆ భూముల్లో ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రెవెన్యూశాఖలోని ఓ అధికారికి భారీగా ముడుపులు సైతం సమర్పించినట్లు తెలుస్తోంది. అందుకే మునెమ్మ కుటుంబసభ్యులను నయానో భయానో దారికి తెచ్చుకునేందుకు యత్నిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ డీల్‌లో ఓ ప్రజాప్రతినిధికి పీఆర్‌ఓ అంటూ చెప్పుకునే వ్యక్తి కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. సుమారు రూ.5లక్షల వరకు చేతులమారడంతోనే అధికార పార్టీకి అనుకూలంగా ఉండే కుటుంబాన్ని సైతం నానా అవస్థలకు గురిచేస్తున్నట్లు గ్రామస్తులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

### ఘనంగా జాతీయ పతాక దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పాకాల :** మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ పతాక దినోత్సవం నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా హెచ్‌ఎం సుమలత మాట్లాడుతూ జాతి సమగ్రతకు , దేశ ప్రజల ఐక్యతకు దిక్సూచి మువ్వన్నెల జెండా అని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు వనపర్తి వెంకటసిద్ధులు, రామ్మూర్తి, సుల్తాన్, ఆదికేశవులు, ప్రమోదిని, విమలా విక్టోరియా, నీరజ, బాబు, సీఆర్పీ మునికృష్ణ పాల్గొన్నారు.

### సచివాలయ సిబ్బందికి సత్కారం


ఉద్యోగులతో సర్పంచ్ తదితరులు

**తిరుపతి మంగళం :** బదిలీపై వెళుతున్న సచివాలయ సిబ్బందిని మంగళవారం మంగళం రణధీర్‌పురం సర్పంచ్ లీలావతి, ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందించిన సచివాలయ సిబ్బంది సేవలను మరువలేమన్నారు. పేదలకు సర్కారు వారధిగా నిలబడి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. అయితే కూటమి ప్రభుత్వం కక్ష గట్టి సచివాలయ ఉద్యోగులను ఎక్కడికి పడితే అక్కడికి బదిలీలు చేసి వారి జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. ప్రజా సేవకులను ఇబ్బంది పెట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్న వస్తారని, మంచి రోజులు వస్తాయని ఉద్యోగులని భరోసా ఇచ్చారు. అలాగే పేదలకు సైతం సంక్షేమ ఫలాలు మళ్లీ ఇంటి ముంగిటకే వస్తాయని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి శశిభూషణ్, ఉప సర్పంచ్ మల్లె మొగ్గల ఉమాపతి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు రజాక్, వార్డు సభ్యులు సతీష్, కుమారి, భూదేవి, మురళి, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.